# స్త్రీలకు ప్రయాణం

-మల్లీశ్వరి

నాకు అతనంటే ఎంతిష్టమో... ఎంచగ్గా నవ్వుతాడో!! వెన్నెల పింజలు పింజలుగా రాలుతున్నట్లు వుంటుంది. ఎంత ప్రేమగా చూస్తాడో!! కాంతి వానలో నిండారా తడుస్తున్నట్లు వుంటుంది. ఎలా స్పృశిస్తాడా!! మత్తెక్కించే అడవిపూల పరిమళం బరువుగా చుట్టుముట్టినట్లు వుంటుంది.

సుమ తదేకంగా మనోహర్ వంకే చూస్తోంది. నిద్రలో అమాయకంగా పసిపిల్లాడిలా కనిపిస్తోన్న అతన్ని మరీ మరీ చూడాలనిపిస్తోంది.

చూస్తున్న కొద్దీ ఆనందంతో, ప్రేమతో అల్లరి తనంతో నవ్వు వుబికి వుబికి వస్తోంది.

మనోహర్‌కి చెరోవైపూ పడుకున్న బాబూ, పాప అతనిమీద కాళ్ళూ, చేతులూ ఇష్టం వచ్చినట్లు పడేసి నిద్రపోతున్నారు. భూభారాన్ని ఎంతో సహనంతో భరించే భూమాతలా నిద్రలోనూ పెదాల వంపులో చిందులేస్తున్న నవ్వుతో ఆనందంగా పడుకున్నాడు మనోహర్.

అనురాగంతో అతని నుదుటిని చుంబించింది. మెలకువ వచ్చింది మనోహర్‌కి. కళ్ళు విప్పాడు.. ఎదురుగా సుమ.. అతని కళ్ళు నవ్వాయి. పెదాలు విడివడ్డాయి.

"ఇంకాస్సేపు పడుకోరాదూ!..." అన్నాడు.

"అయిదున్నరయింది..." అతని నుదుటి మీద జీరాడుతున్న వెంట్రుకల్ని పైకి తోస్తూ అంది.

"వూ..." అంటూ తన మీద పడున్న పిల్లల కాళ్ళూ చేతుల్ని మెల్లగా తప్పించి లేచాడు.

ఇద్దరూ వుద్యోగస్థులవడం మూలంగా ఎవరి పనుల్లో వాళ్ళు పడ్డారు.

ఇద్దరూ కలిసి వంట చేసుకుంటుండగా హఠాత్తుగా సుమకి ఓ విషయం గుర్తొచ్చింది... నిన్న సాయంత్రం ఆఫీస్ నుంచి బస్టాప్‌కి నడిచి వస్తుండగా తన కొలీగ్ అడిగిన ప్రశ్న.. "మీ వారిని చాలాసార్లు చూశాను.. మాట్లాడాను.. మీరంటే ఆయనకి అంతులేని ప్రేమ వున్నట్లుగా అన్పిస్తోంది. అసలు మీరంటే ఆయనకి ఎందుకంత ఇష్టం?..." అంది.

తనకి వెంటనే ఏం సమాధానం చెప్పాలో తెలీలేదు. నవ్వేసి వూరుకుంది... అవునూ... మనోహర్‌కి తనంటే ఎందుకిష్టం??... తల తిప్పి అతని వంక చూసింది.. చాలా ఏకాగ్రతతో కారెట్‌ని కట్ చేస్తున్నాడతను.. ముచ్చట పడుతూనే.

"మనూ!... నేనంటే నీకెందుకు ఇష్టం?.." అడిగేసింది సుమ. తల తిప్పకుండానే ముసిముసి నవ్వులు రువ్వాడు.. చేస్తున్న పని వదిలేసి వచ్చి "చెప్పవా?" గారంగా అడిగింది.

అప్పుడు తల తిప్పి ఆత్మీయంగా ఆమె వంక చూశాడు.

"ప్లీజ్..." బతిమలాడుతున్న స్వరంతో అడిగింది. సుమ జవాబు చెప్పడానికి అతనేం సంకోచించలేదు. ఆలోచించలేదు... చాలా స్పష్టమయిన కంఠంతో..

"నీ వ్యక్తిత్వం అంటే యిష్టం నాకు... నువ్వు నన్ను నగలూ, బట్టలూ కొనిచ్చేవాడిలా చూడలేదు... 'నన్నూ పిల్లల్నీ నువ్వే పోషించూ' అనలేదు. మన అనుబంధం పట్ల చాలా శ్రద్ధగా వుంటావు.. కుటుంబాన్ని నడిపే బాధ్యత నాదొక్కడిదే అని నువ్వెపుడూ భావించలేదు. మనిద్దరిలో ఎక్కువ తక్కువలు లేవన్న జ్ఞానాన్ని నీ సాహచర్యంలోనే నేర్చుకున్నాను... అంతెందుకు నువ్వు నీలా వుంటావు... నన్ను నాలా వుండనిస్తావు.. అందుకే నువ్వంటే ఇష్టం..." చెప్పాడు.

చిరునవ్వుతో మొహం వికసించగా మళ్ళీ పనిలో పడింది సుమ.. ఎనిమిదిన్నర కల్లా తయారయి ఆఫీసుకి బయలుదేరింది. హాలు దాటుతుండగా టీపాయ్ మీదున్న శుభలేఖ ఆమెని ఆకర్షించింది.

అంత అందంగా వుంది ఆ కార్డు... అది చేతిలోకి తీసుకుని చూస్తుండగా మనోహర్ వచ్చాడు. "నా బెస్ట్ ఫ్రెండ్ మధు మారేజ్ కార్డ్ అది.. నిన్న ఆఫీసుకి వచ్చింది... వాడు ఉద్యోగంలో డెవలప్‌మెంట్ కోసం ఆ దేశం, ఈ దేశం తిరుగుతూ ముప్ఫయి మూడేళ్ళు వచ్చే వరకూ పెళ్ళి ప్రయత్నం చేయలేదు. ఇదుగో ఇప్పుడు ఆసక్తి కలిగినట్లుంది... రోజూ ఫోన్‌చేసి చెపుతూనే వున్నాడు. రెండు రోజులు ముందే రమ్మని.. నీకు సెలవు దొరుకుతుందా? వెళ్దామా?" అడిగాడు.

"వూ!... ఎక్కడా పెళ్ళి?..." ఆసక్తిగా అడిగింది.

"మా పెద్దమ్మగారి వూళ్ళోనే... ఏలూరు దగ్గర వట్లూరులో..." చెప్పాడు.

సుమ పెళ్ళికార్డుని ఓపెన్ చెయ్యగానే అందులోంచి గులాబీ పువ్వు రంగులో, అదే షేప్‌లో వున్న పేపర్ కింద పడింది.

సుమ సంభ్రమంగా తీసి చూసింది... అందులోంచి 'స్త్రీలకు ప్రయాణం' అన్న అక్షరాలు కన్పించాయి.

"ఇదేంటీ?..." ఆశ్చర్యంగా అడిగింది.

"నీకు తెలీదా?.. ఆ కార్డ్ లేకపోతే..." అంటూ ఏదో అనబోయి గభుక్కున మాటలు మింగేసి తడబడ్డాడు.

వింతగా చూసింది సుమ. ఆమె పుట్టడం, పెరగడం అంతా వైజాగ్‌లోనే. మనోహర్‌ది విజయవాడ. చదువు నిమిత్తం ఆంధ్రా యూనివర్సిటీలో చేరి అక్కడ పరిచయమయిన సుమని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఇద్దరి కులాలు వేరు.. ఆహారపు అలవాట్లు వేరు. ఆచార సంప్రదాయాలు వేరు.. ఈ భిన్నత్వం తమ జీవితం మీద ఏ ప్రభావం చూపించకుండా వుండటానికి ముందే మనసు విప్పి మాట్లాడుకున్నారు. ఇద్దరి మధ్యా కుల ప్రసక్తి వుండకూడదు.. ఆరోగ్యాన్నిచ్చే ఆహారాన్ని తినాలి. ఇద్దరి మనసులూ నొప్పించని ఆచారాలని పాటించాలి. అంతే! ఇప్పటివరకూ ఏ పొరపొచ్చాలూ లేకుండా జీవితం పూలవానలా సాగిపోతోంది.

"ఏయ్! మనూ... చెప్పు?... ఎలా ఎందుకు రాసారు...? కార్డ్ మగవాళ్ళ పేరున వేస్తారు కదా!... ఆడవాళ్ళు బాధపడతారని ఇలా వేశారా?.. నేనెపుడూ ఇలాంటి కార్డులను చూడలేదు.. ఆడవాళ్ళని ఇలా గౌరవించే వాళ్ళూ వుంటారా?" సుమ అంటుంటే మనోహర్ తల అటూ ఇటూ కాకుండా వూపేసాడు.

"ఈ పెళ్ళికి నేనూ తప్పకుండా వస్తాను..." డిక్లేర్ చేసింది సుమ...

❖ ❖ ❖

రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లో ఏలూరు చేరుకున్నారు సుమ, మనోహర్, పిల్లలు. మధు స్టేషన్‌కి కారు పంపించాడు. ఆమె ఏలూరు ఎపుడూ రాలేదు.. అందుకే కారులో వట్లూరు వచ్చేపుడు తను డిగ్రీ చదివిన సి.ఆర్.రెడ్డి కాలేజీని సుమకీ, పిల్లలకి చూపించాడు మనోహర్. నాన్న చదివిన కాలేజీని చూడటానికి విండో సీట్ కోసం పోటీపడ్డారు బాబూ, పాప.

ఊరి చివర రైసుమిల్లు దగ్గర మనోహర్ పెద్దమ్మగారిల్లు... ఆవిడ ఇద్దరు కొడుకులూ అమెరికాలో సెటిలయ్యారు. ఆమె, ఆమె భర్త ఇద్దరే వుంటారు. పెద్ద మండువా లోగిలి యిల్లు. చుట్టూ పొలాలు.. వాటి మీద ఎగురుతున్న కొంగలు.. ప్రాణం

## మా వూళ్ళో కూడా

దొర జెర్సీ ఆవును తెచ్చిననాడే
వూరు వూరంత అబ్బుర పడింది
కరెంటు వచ్చినరోజు
వూరంతా సంబరపడింది
మోటబావులు మోటు అయి
కరెంటు మోటార్లు వచ్చాయి
ఊటబాయిలోని
ఊటనీరంత చివరి బొట్టు లాగేసి
వట్టిబాయిగా మారేవరకు పని
కర్రు నాగళ్ళు పోయె
పవర్ టిల్లర్లు, మరి ట్రాక్టర్లు వచ్చె
పశువులతో పని తగ్గిపోయె
బంతులు కట్టే పనిలేదు
తూర్పార పట్టేటందుకు చాటలక్కరలేదు
గాలిమోటరు వచ్చె
కూలోళ్ళ నోళ్ళు కొట్టె
క్రేనులు, ప్రొక్లేన్లు వచ్చె
తోలుబొమ్మలెప్పుడోపోయి
బుల్లి తెరలు చోటుచేసుకున్నాయి
వీధిబడులు కాస్తా
వీధి రాబడులాయె
కమ్మనైన అమ్మా అనే బదులు
మమ్మీ డాడీ చిలుక పలుకులొచ్చె
గుడిసెలు పోయి డాబాలుపోయి
సిమెంట్ మేడలొచ్చె
ఊరపిచ్చుకలు
ఊరొదిలిపోయె
పండుగ సంబరాల్లో
మందు పసందుగా మారె
నైటీలొచ్చి కనుసైగ చేస్తున్నాయి
షార్ట్‌లొచ్చి సైటుకొడుతున్నాయి
మావూళ్ళో కూడా-

—కొలనుపాక మురళీధరరావు

## వనదేవతకు వందనం

కష్టాలకు, కన్నీళ్లకు జడిసి
ఆత్మహత్య చేసుకునే మనిషిని
చివరి వరకు తలెత్తుకు జీవించమని-
మొదలంటా కొట్టేసినా
చివుళ్లతో చిరునవ్వులు చిందించే చెట్టు చెబుతుంది.
ఎపుడూ చూపు ఆకాశం వైపు
వేళ్లు మాత్రం నేలలోకే దింపు
నిటారుగా నిలబడు
నిలకడగా వుండు
నీడనిచ్చు, నిప్పు నిచ్చు
పూవు నిచ్చు, పండునిచ్చు
పుట్టినపుడు ఊయెలలోకి
గిట్టినపుడు గోతిలోకి
వెంటవుండును, తోడువచ్చును చెట్టు.
తను ఊదిన ఊపిరులు
మనుషులకు ప్రాణవాయువులు
శరీరం నుండి మాంసఖండం కోసిచ్చి
పావురాన్ని కాపాడిన శిబి చక్రవర్తి కన్నా;
రాక్షస సంహారం కోసం ఇంద్రుడి వజ్రాయుధానికి
ఎముకనిచ్చిన దధీచికన్నా;
మానవుల కోసం తనువు మొత్తం
త్యాగం చేసే తరువు వారికన్నా త్రాసులోమిన్న.
నాలుగు నీటి చుక్కలు చిలకరిస్తే చాలు,
పులకరించిపోయి
వర్షాన్నే పిలిచి మనకందిస్తుంది చెట్టు.
వాతావరణ విష కాలుష్యాన్ని దిగమింగి నీలకంఠుడైన
చెట్టు
లోక పరిరక్షణకు, కళ్యాణానికి కారణమవుతుంది
కూచున్న కొమ్మనే నరుక్కునే మూర్ఖుణ్ణి చూసి
చెట్టు మండిపడదు, జాలిపడుతుంది.
పట్టెడు విత్తుల్ని చల్లితే
పుట్టెడు ఫలాల్నిస్తుంది చెట్టు.
చెట్టు మనిషికి, జీవజాలానికి సహజ చుట్టము, మంచి
మిత్రము
చెట్టు పౌరోహితుడు
బోధివృక్షం కింద బోధిసత్త్వుడికి జ్ఞానోదయం
చెట్టు నీడన విద్యాలయం
చెట్టంతా వైద్యాలయం
చెట్టు పూజనీయం
వనదేవతకు వందనం.

—డా॥ కేతు బుచ్చిరెడ్డి

లేచి వచ్చింది సుమకి. మనోహర్ పెద్దమ్మ శాంతమ్మ సుమని ఆప్యాయంగా పలకరించింది...

మర్నాటి ఉదయం పిల్లలు పొలంలో వున్న బోరు దగ్గర నీళ్ళ కుండీలో స్నానం చెయ్యాలని వుబలాటపడ్డారు. సుమకి కూడా ఉత్సాహంగా అన్పించింది. నలుగురూ కలిసి పాలేరుని వెంట పెట్టుకుని శాంతమ్మకి చెప్పి బయల్దేరుతుంటే "నువ్వొద్దులేమ్మా!.." యథాలాపంగా సుమతో అందామె.

"ఏం అత్తయ్యా?.." తెల్లబోతూ అంది సుమ.

"మనవైపు ఆడాళ్ళు పొలాలకి వెళ్ళరు.. ఎవరికన్నా తెలిస్తే నవ్వుతారు.. మనూ నువ్వు వెళ్ళరా!..." అందామె.

మొహం ఎర్రబడింది సుమకి. పొలం వెళ్ళడం తప్పా? మనోహర్ వైపు చూసింది... మనోహర్‌కి ఏం చెప్పాలో తోచలేదు.. పాలేరుని పిల్లల్ని తీసుకుని వెళ్ళమని చెప్పి మనోహర్ ఆగిపోయాడు.

ఈసారి ఆశ్చర్యపడటం శాంతమ్మ వంతయింది. సుమ ఎందుకు డల్ అయిందో అర్థం కాలేదు. ఆ అమ్మాయి మంచి కోసమేగా తను చెప్పింది అనుకుని సుమ వెంట వెంటే తిరుగుతూ ఏవో కబుర్లు చెప్పి నవ్విస్తూ సుమని మామూలు స్థితికి తెచ్చింది.

మనోహర్ మధుని కలిసి వస్తానని వెళ్ళాడు. పెళ్ళి రాత్రికే!.. పెళ్ళికూతురుదీ ఈ ఊరే!.. అందుకే పెళ్ళికి ఇంకేవూరూ వెళ్ళాల్సిన అవసరం లేదు.

సుమ, శాంతమ్మ కూర్చుని మాట్లాడుకుంటుంటే ముతక బట్టలు ధరించిన ఓ యాభై ఏళ్ళ వ్యక్తి వచ్చి వాకిట్లోంచే "శాంతమ్మగారూ!..." పిలిచాడు.

'ఆఁ' లోపలి నుంచే కేకేసిందామె.

"ధనకోటేశ్వరరావు గారి అబ్బాయి మధుబాబు పెళ్ళి సందర్భంగా ఈ పొద్దున్న మగోరికి భోజనాలు... తప్పకుండా రావాలి..." పాఠం చదివినట్లుగా చెప్పి వెళ్ళిపోయాడు.

నిర్ఘాంతపోయి వింది సుమ... "మగవాళ్ళకి భోజనాలేంటి?..." అర్థం కానట్లు అడిగింది.

"పెళ్ళి రాత్రికిగా! ఈ పూట.. ఊళ్ళో ముఖ్యమైన ఇళ్ళలో మగవాళ్ళకి భోజనాలు పెడతారు. మీ మావయ్య, మనూ, బాబూ వెళతారు. నీకూ, నాకూ, పాపకి వంట చేస్తాలే.." అని శాంతమ్మ అంటుంటే అయోమయంగా చూసింది.

తమ పెళ్ళయిన ఇన్నేళ్ళలో మొదటిసారిగా తమ

కుటుంబంలో ఓ విషయంలో ఇద్దరికి అర్హత వుండటం, మరో యిద్దరికి అర్హత లేకపోవడం చూస్తోంది...

"ఆడవాళ్ళని ఎందుకు పిలవరు..." అసంకల్పితంగా అడిగింది...

"ఊరంతా భోజనాలు పెట్టలేరు! అదీకాక కుటుంబ పెద్దనీ, అతని వారసుల్నీ అందరూ గౌరవించాలి కదమ్మా!..." అంది శాంతమ్మ.

మనసు మెలిపెట్టినట్లయింది సుమకి. "అలా పిలవలేనపుడు బాగా ముఖ్యులనుకున్న పది పదిహేను కుటుంబాలలో అందరినీ పిలుచుకోవచ్చుగా!..." అంది సుమ.

పదునుగా వున్న ఆమె కంఠ స్వరం విని నివ్వెరపోయింది శాంతమ్మ. సుమ భావాలు ఆమెకి అర్థం కాలేదు...

దిగులుగా కూర్చుంది సుమ... కాసేపటికి మనోహర్ వచ్చాడు. అతనికీ తనకీ మధ్య ఏవో దూరం ఏర్పడినట్లు వుంది...

"మధు వాళ్ళింట్లో మొగాళ్ళకి భోజనాల్రా, మీరు వెళతారుగా!..." అంది శాంతమ్మ.

మనోహర్ మొహం చిన్నబోయింది. తనని పట్టుకుని వుయ్యాల వూగుతున్న పాపని గుండెలకి హత్తుకుని సుమ వంక ఆర్తిగా చూస్తూ

"ఊహూ!... ఇక్కడే చేస్తాను... రాత్రికి అందరం కలిసి వెళతాం..." చెప్పాడు.

కొంచెం మనసు తేలిక పడింది సుమకి... మనోహర్ భోజనం చేసి కాసేపు పడుకుని లేచి మధు వాళ్ళింటికి వెళుతూ సాయంత్రం ఏడింటికల్లా రెడీగా వుండమని చెప్పాడు.

మనోహర్ అటు వెళ్ళగానే "ఆ!... ఏడని చెపుతారుగానీ మగాళ్ళ బంతులు అయ్యేసరికే తొమ్మిది దాటుతుంది. నువ్వు ఎనిమిదిన్నరకి వెళితే సరిపోతుందిలే!..." అంది.

"మగాళ్ళ బంతులేంటి?..." మళ్ళీ ఏం వినాల్సి వస్తుందోనని బితుకు బితుకు మంటూనే అడిగింది.

"ముందు మగాళ్ళ భోజనాలు అయ్యాకే ఆడాళ్ళకి భోజనాలు పెడతారు..."

"ఎందుకలా?..." సుమ అడిగింది.

"ఎందుకేంటి? మగాళ్ళు తిన్నాకే కదా ఆడాళ్ళు తినాలి" అందామె.

కళ్ళప్పగించి చూసింది సుమ. ఆమెకి తను ఎంత అజ్ఞానంలో వుందో అర్థమయింది. తను బాగున్నట్లే లోకం అంతా బావుందని అనుకుంది. వూహూ.. లోకంలో అంతా సుఖంగా లేరు. మరీ ముఖ్యంగా ఆడాళ్ళు గౌరవంగా జీవించడం లేదు.

సాయంత్రం ఆరు వరకూ అన్యమనస్కంగానే గడిపి స్నానం చేసి తయారయి... శాంతమ్మ దగ్గరకి వచ్చి "మీరూ రెడీ అవండి..." అంది సుమ.

"మాకు స్త్రీలకి ప్రయాణం లేదమ్మా! నేను రాను. మీ మావయ్య వస్తారు..." అందామె.

సుమకి తను చూసిన శుభలేఖ అందులోని 'స్త్రీలకి ప్రయాణం' కార్డు గుర్తొచ్చింది. ఏదో లింక్ అందుతోంది. మనసులో అనుమానం సుళ్ళు తిరుగుతోంది.

"అలా ఎందుకు రాస్తారు?..." అడిగింది సుమ.

"'స్త్రీలకి ప్రయాణం' అని వుంటేనే ఆడవాళ్ళు పెళ్ళికి వెళ్ళాలి... లేకపోతే కేవలం మగాళ్ళే వెళ్ళాలి..." చెప్పింది శాంతమ్మ.

తలంతా హోరు... ఇదేంటీ?... ఇలా అవమానించడం ఏంటి?... ప్రతి అంశంలోనూ తేడానే! అది కాదు ఆమెని అంతగా బాధపెడుతున్నది. అతని చుట్టాల ఇళ్ళ నుంచి స్త్రీలకి ప్రయాణం లేని కార్డులే ఇప్పటివరకూ వచ్చాయి... అంటే వాళ్ళెవరికీ మనోహరే కావాలిగానీ తనక్కరలేదు. అన్నింటికన్నా ముందు వాటిలో రెండు మూడు పెళ్ళిళ్ళకి మనోహర్ వెళ్ళాడు. అంతేకాదు... రాజమండ్రి పెళ్ళికి వెళుతూ బాబుని వెంట పెట్టుకుని కూడా వెళ్ళాడు.

అంటే అతనూ బాబూ ఒకటీ, తనూ-పాపా ఒకటా? పాపకీ, తనకీ లేని కొన్ని అర్హతలు వాళ్ళకి వున్నాయా?... గుండె బరువుగా మారింది.

పెరట్లో నూతి గట్టు మీద కూర్చుని ఆలోచిస్తోంది సుమ... బాబు, పాప తూనీగల్లా ఎగురుతూ ఆడుతున్నారు... ఇద్దరినీ పట్టి పట్టి చూసింది. తనకేం తేడా కనిపించడం లేదు. లోకానికెలా కనిపిస్తోందో!...' దిగులుగా అనుకుంది.

దూరం నుంచి మనోహర్ ఆత్రంగా తనవైపే రావడం కన్పిస్తోంది. అతని ప్రేమలో కల్మషం లేదు. అది తనకి తెలుసు. కానీ అతను తనని అక్కర్లేదనుకున్న వాళ్ళ దగ్గరకి వెళ్ళాడు.

"ఏంటి సుమా డల్‌గా వున్నావు?..." ఆమె తల నిమురుతూ అడిగాడు.

అతని కళ్ళలోకి లోతుగా చూసింది. తన పట్ల ప్రేమతో స్వచ్ఛంగా వున్నాయవి.

"స్త్రీలకి ప్రయాణం' వుంది కాబట్టి నన్ను తీసుకొచ్చావు కదూ!" అడిగింది.

విస్తుపోయి చూశాడు మనోహర్.

"నేనూ, పాప వద్దనుకున్న వాళ్ళకోసం నువ్వూ బాబు వెళ్ళారు" ఆవేదనగా అంది.

అతని కళ్ళు బాధతో విలవిల్లాడాయి.

## నవతరమా... మేలుకో!

వెండి తెరపై వెలుగు భ్రాంతికి
చేవచచ్చిన భవిత బీజం
కండ కలిగిన యువత బానిస!
మోదకరమా? ఖేదకరమా?

ధనం కోసం పేరుకోసం
సిగ్గు విడుచుట హితం మరచుట
హింస రచనం, ధ్వంసం వచనం
నీతికరమా? భీతికరమా?

ఇంటి లోపల ఒంటి లోపల
మంటపెట్టే మాయజ్వాల
చిన్ని తెరపై ఎన్ని చిత్రాలు!
మానవతపై ఎన్ని ఛిద్రాలు?!

లబ్ధికొరకై బుద్ధిమరచిరి
జనం రక్తం మలినపరచిరి
డాబు ఎవరిది? డబ్బు ఎవరిది?
ఎవరు హీరో? ఎవరు జీరో?

గొంతులేయగ ఫైట్లు చేయగ
హీరోలెట్లా? చెప్పు మిత్రమ?
మంచితనమే హీరోయిజమౌ
తెలుసుకోరా తమ్ముడా!

ప్రజల మేలుకు ప్రాణములిచ్చి
క్రీస్తు బుద్ధుడు గాంధి బోసులు
మదరు థెరిసా మార్గదర్శులు
జ్ఞాననేత్రం విచ్చి చూడు

వీరరక్తం, ధీరచిత్తం
సినీమాయకు వ్యర్థపరచుట
వారసత్వమ? నీరసత్వమ?
నిజం ఏదో నీవె తెల్పు.

-పింగళి గంగాధర్‌రావు (మనస్వి)

"నేను అంత దూరం ఆలోచించలేదు... నేను పుట్టిన దగ్గర నుంచే ఈ సంస్కృతీ, ఆచారాల్లో లీనమయిపోయాను. వాటిని పాటిస్తున్నాననుకున్నాను..." మనోహర్ చెపుతుండగా మధ్యలోనే అతని మాటల్ని ఆపేసి "నీకు తప్పుగా అన్పించలేదా?..." ఆరాటంగా అంది.

అతను అంతర్ముఖుడయ్యాడు.

"ఈ పద్ధతి... ఒక కుటుంబాన్ని ఆడా, మగా పేరుతో రెండుగా విడగొడుతున్నట్లు నీకనిపించడం లేదూ?... మగాళ్ళని మాత్రమే భోజనాలకి పిలిచే సంస్కృతీ, 'స్త్రీలకి ప్రయాణం' అని చెపితేనే తప్ప వాళ్ళు పెళ్ళిళ్ళకి బయల్దేరలేని దుస్థితి, ముసలాళ్ళయినా, గర్భిణులైనా, చిన్న పిల్లలైనా మగాళ్ళు భోజనం చేస్తే తప్ప వాళ్ళు చేయలేని పరిస్థితీ... ఇవి నీకు నచ్చాయా?.. ఇందులో లీనమవడం నీకిష్టమా?..." ప్రశ్నించింది సుమ.

"మనమేం చెయ్యగలం?..." అసహాయంగా అన్నాడు మనోహర్.

"చెయ్యగలం... కనీసం మనకోసం. మన సంతృప్తి కోసం ఏదో ఒకటి చెయ్యగలం... ఈ వివక్ష లేనిచోటికే మనం వెళతాం... ఈ వివక్ష కూడదని అందరికీ చెపుదాం... నవ్వుతారా?... నవ్వనీ!... ఆడవాళ్ళని కించపరిచే ఇలాంటి సంప్రదాయాల్ని రూపుమాపడానికి కృషిచేశామన్న సంతృప్తి మిగులుతుంది..." అంది సుమ.

సాలోచనగా తలూపాడు మనోహర్.

"మధు ఈరోజు మనిద్దరినీ పిలిచాడు కాబట్టి హమ్మయ్య స్త్రీలకి ప్రయాణం వుందని నేను బయల్దేరొచ్చు... కానీ నాలాంటి ఆడవాళ్ళనే చాలా మందిని అవమానించారు. అందుకే ఇపుడేం చెయ్యాలో చెప్పు..." అంది సుమ.

లేచి నిలబడ్డాడు మనోహర్.. "ఈ రోజు రాత్రికే బస్‌లో వైజాగ్ వెళ్ళిపోదాం... తర్వాత ఫోన్‌లో అతనికి మన ఫీలింగ్స్ చెపుతాను..." అన్నాడు.

సుమ హృదయం తేలికయింది.

అందుకే నాకు అతనంటే ఎంతిష్టమో!!...

స్త్రీలను... వూహూ... మనుషులని ఎంత బాగా గౌరవిస్తాడో!!... హిమాలయ పర్వతం కళ్ళముందు నిల్చున్నట్లు వుంటుంది. ■